


ప్రణాళిక విభాగానికి..

## మరింత గౌరవాన్ని పెంచాలి

- 35ఏళ్లుగా కొత్త విషయాలను డైరీ ద్వారా ప్రచురిస్తున్నారు
- ఆంధ్రప్రదేశ్ పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ డైరెక్టర్ ఆర్ జె.విద్యుల్లత

వివరాలు 2లో...

18వ వసంతంలోకి...
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
శనివారం 25 జనవరి 2025
పేజీలు 8

# తప్పు కొట్టు బండి పెట్టు




- ఫుడ్ కోర్టులో మరింత పెరిగిన ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు
- కరెంటు, క్లీనింగ్‌కి ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్టు ఇచ్చారా?
- ఒక్కో బండి నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు
- కొత్తగా బండ్లకు అనుమతి నివ్వలేదంటూనే వ్యాపారం షురూ
- ప్రైవేట్ వ్యక్తులు ఫుడ్ కోర్టులో అరాచకాలు చేస్తుంటే ఎవరి బండ్లు వాళ్లే తోసుకెళ్లాలని బ్యానర్లా
- అధికారుల తనిఖీల్లో బయటకు రాని రహస్యాలు

వివరాలు 2లో



## ముస్లిం, మైనార్టీల పక్షపాతి సీఎం

49,218 మందికి రూ. 326 కోట్ల సబ్సిడీతో రుణాలు అందిస్తాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్

వివరాలు 2లో

## ప్రజల ఆరోగ్య సంరక్షనే లక్ష్యం

- హెచ్ఐవి ఎయిడ్స్ మహమ్మరిని సమూలంగా రూపుమాపుద్దాం
- హెచ్ఐవి వ్యాధిగ్రస్థులలో మనోధైర్యాన్ని నింపాలి
- వ్యాధి లక్షణాలున్న వారికి వైద్య పరీక్షలకు మొబైల్ వాహనం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : ప్రజల ఆరోగ్య సంరక్షనే ప్రభుత్వ ప్రాధాన లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి పూర్తి వైద్య 2

(మొదటిపేజీ తరువాయి)

ప్రణాళిక విభాగానికి

## మరింత గౌరవాన్ని పెంచాలి

**35ఏళ్లుగా కొత్త విషయాలను డైరీ ద్వారా ప్రచురిస్తున్నారు**

**ఏపీ పట్టణ ప్రణాళిక ఉద్యోగస్తుల డైరీ ఆవిష్కరణ**

**ఆంధ్రప్రదేశ్ పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ డైరెక్టర్ ఆర్ జె.విద్యుల్లత**



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** శుక్రవారం, మంగళగిరిలోని లిటిల్ విలేజ్ ఫంక్షన్ హాల్ వద్ద ఆంధ్రప్రదేశ్ పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ డైరెక్టర్ ఆర్ జె.విద్యుల్లత చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళిక ఉద్యోగస్తుల సంఘం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు.గత 35 సం.లుగా అవిరళంగా కొత్త విషయాలను అందించేలా ప్రచురించబడుతున్న ఈ క్యాలెండర్, డైరీకి ఆమె ప్రశంసలు తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం పనితీరులో కొత్తగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రణాళిక సిబ్బంది మార్పును స్వీకరించి, ప్రణాళిక విభాగం గౌరవాన్ని మరింత పెంచేలా కృషి చేయాలని ఆమె సూచించారు. శాఖ ద్వారా నగర ప్రజలకు సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయన్నారు. నగర పరిధిలోని ప్రజల నుంచి అధికారులకు, సిబ్బందికి వస్తోన్న కృతజ్ఞత భావం ప్రసంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డైరెక్టర్ బి. శ్రీనివాసులు, డిప్యూటీ డైరెక్టర్లు కె.వి. రంగరాజు, కె. హరిదాసు, ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళిక ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షులు వేంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు, జనరల్ సెక్రెటరీ పి. మోహన్ బాబు, టౌన్ ప్లానింగ్ అధికారి వసీం బేగ్, ఇతర సభ్యులు, డిటీసీపీ ఆఫీసు సిబ్బంది, వివిధ పురపాలక సంఘాల టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ముస్లిం, మైనార్టీల పక్షపాతి సీఎం చంద్రబాబు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని ముస్లిం, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అందించిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ తెలిపారు.. బందరు రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ మైనార్టీలకు రూ. 326 కోట్ల సబ్సిడీ రుణాలను నాలుగు స్లాబ్స్ లలో 49,218 మంది లబ్దిదారులకు అందిస్తామన్నారు. మొదటి స్లాబ్ గా 1 లక్ష వరకు, రెండో స్లాబ్ లో 1 నుంచి 3 లక్షలు, మూడో స్లాబ్ లో 3 నుంచి 5 లక్షల, నాలుగో స్లాబ్ క్రింద 8 లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. ఈ రుణాలను లబ్ధిదారులు చెల్లించాల్సిన 10 శాతం షేర్ కూడా వారు చెల్లించకుండా అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఎటువంటి పథకాలు అందించలేదన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముస్లిం, మైనార్టీలకు సబ్సిడీ పథకాలు అందిస్తున్నామన్నారు. గతంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోయాయన్నారు. అదేవిధంగా జిల్లాల్లో కూడా ఏవిధమైన యాక్టివిటీస్ నిర్వహించలేదన్నారు. యువగళంలో మంత్రి నారా లేకేష్ ముస్లిం, మైనార్టీల సమస్యలు నోట్ చేసుకున్నారన్నారు. దానిఫలితంగానే నేడు వేల మందికి సబ్సిడీ పథకాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. మొదటి నుంచి ముస్లిం, మైనార్టీలకు అండగా ఉంటున్న నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అన్నారు. గత ప్రభుత్వంలో మైనార్టీల కళాశాలలు, ఐటీఐ కళాశాలలు మూతవేశారన్నారు. అదేవిధంగా కడపలో 25 కోట్లతో హజ్ హౌజ్ నిర్మిస్తే దానిని కూడా వృధా చేశారన్నారు. కర్నూలులో అబ్దుల్ హక్ యూనివర్శిటీ పనులు 40 శాతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు చేస్తే దానిని కూడా కుంటుపడేలా చేసారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింలలో పేదరికం ఎక్కువగా ఉందని దాన్ని తొలగించేందుకు అవిరళ కృషి చేస్తున్నారన్నారు. అందుకే పూర్ టూ రిచ్ కాన్సెప్ట్ ద్వారా అనేక సంక్షేమ పథకాలు ముస్లిమ్స్ కు అందించి వారిని ధనవంతులుగా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి క్షణం ప్రజల కోసం పనిచేస్తున్నారన్నారు. మా ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి కేరాఫ్ గా రాష్ట్రాన్ని మార్చుతామన్నారు. పాత్రికేయుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ వీసీ, ఎండీ కే. యాకూబ్ భాషా, జనరల్ మేనేజర్ షణ్ముఖరావు పాల్గొన్నారు.

# డబ్బు కొట్టు బండి పెట్టు






**ఫుడ్ కోర్టులో మరింత పెరిగిన ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం**

**తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు**

**కరెంటు, క్లీనింగ్‌కి ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్టు ఇచ్చారా?**

**ఒక్కో బండి నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు**

**కొత్తగా బండ్లకు అనుమతి నివ్వలేదంటూనే వ్యాపారం షురూ**

**ప్రైవేట్ వ్యక్తులు ఫుడ్ కోర్టులో అరాచకాలు చేస్తుంటే ఎవరి బండ్లు వాళ్లే తోసుకెళ్లాలని బ్యానర్లా**

**అధికారుల తనిఖీల్లో బయటకు రాని రహస్యాలు**

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వడ్డించేవాడు మనవాడైతే ఏ వరుసలో కూర్చుంటే ఏముంది అన్నట్లుగా అధికారులు మన వెనకాల ఉంటే ఎన్ని అరాచకాలు చేసినా ఎవరు అడుగుతారులే అన్న ధీమా పెరిగిపోయినట్టుంది ఫుడ్ కోర్టులో ప్రైవేట్ వ్యక్తుల దందా... అనధికారికంగా బండ్లు ఏర్పాటు చేస్తున్నారు. అందిన కాడ ప్రతి బండి కాడ వసూలు చేస్తున్నారు ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులు ఫుడ్ కోర్టును శాసిస్తున్నారన్న కథనాలు నేటి దినపత్రిక సూర్యలో ప్రచురితమైంది. దీంతో కదిలిన అధికార యంత్రాంగం తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది.

అర్ధరాత్రి బందర్ రోడ్డులోని ఫుడ్ కోర్టులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి మమ అనిపించేశారు. తాజాగా వీఎంసి విడుదల చేసిన ప్రకటనలో వీఎంసి, పోలీస్ కలిపి ఫుడ్ కోర్టు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. కాని రాత్రి 9 గంటల నుంచి 11.30 నిముషాల దాకా ఒక్క పోలీస్ కనబడడం లేదు. మరోవైపు ఫుడ్ కోర్టుకు ఇరువైపులా అటు ఇటు భారీ కేడ్లు పెట్టి మరీ ప్రైవేట్ సిబ్బందితో విధులు నిర్వహిస్తూ లోపలికి ఏ వెహికల్ రావాలన్న వారి అనుమతి తప్పనిసరి చేసేశారు. తాజాగా వీఎంసి ఎస్టేట్ అధికారులు తనిఖీల్లో ఈ ప్రైవేట్ సైన్యాన్ని దాటుకొని వెళ్ళినా వీరు కనబడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు కొత్త బండ్లు ఏమైనా పెట్టినా ఖచ్చితంగా వీఎంసి పర్మిషన్ కావాలి. తాజాగా వీఎంసి విడుదల చేసిన ప్రకటనలో కొత్త తోపుడు బండ్లకు అనుమతినివ్వలేదని తెలిపింది. కాని తాజాగా బందర్ రోడ్డులోని ఫుడ్ కోర్టులో కొత్తగా ఏర్పాటు చేసిన పలు బండ్లకు అనుమతి లేదని ప్రచారం జరుగుతోంది. అలాగే ఫుడ్ కోర్టులో కరెంటు, క్లీనింగ్ కి కాంట్రాక్టు ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తులు ఫుడ్ కోర్టు లో ప్రతిరోజు బండ్లు వద్ద రోజుకింత అని వసూలు చేస్తున్న అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా తోపుడు బండ్లు ఎవరూ ఫుడ్ కోర్టులో వదిలివెళ్లకూడదని బ్యానర్లు పెట్టడంపై పలువురు సెటైర్లు వేసుకుంటున్నారు. వీఎంసి ఫుడ్ కోర్టులో రూపాయి రుసుం కట్టించుకోనప్పుడు ఫుడ్ కోర్టులో ప్రైవేట్ వ్యక్తులు వసూలు చేస్తుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్న తలెత్తుతుంది. అయితే ప్రైవేట్ వ్యక్తుల దోపిడీపై వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా వీఎంసి అధికారులు ఫుడ్ కోర్టులో ప్రైవేట్ వ్యక్తుల దోపిడీ నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు పలువురు వ్యాపారులు. చూడాలి అధికారులు ఏ విధంగా స్పందిస్తారోనని.

**ఇంతకీ ఫుడ్ కోర్టులో మాల్యాద్రి ఎవరు ..తనిఖీల్లో ఆర్ ఐ అతనితో ఏం మాట్లాడారు రేపటి సంచికలో..**

# ప్రజల ఆరోగ్య సంరక్షనే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

సహాయం అందించేందుకు రూ.3.60 కోట్ల ఖర్చుతో 10 ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటల్ (ఐసిటిసి) వ్యాన్‌లను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఏపి స్టేట్ ఎయిడ్స్ కౌంట్రోల్ సోసైటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటల్ (ఐసిటిసి) మొబ్కెల్ వాహనాలను శుక్రవారం వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సిద్ధార్థా మెడికల్ కళాశాల ప్రాంగణం నుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణనే లక్ష్యంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా రూపుమాపేందుకు ప్రభుత్వం కృత నిచ్చయంతో చర్యలు తీసుకుంటుందన్నారు. హెచ్ఐవి వ్యాధి లక్షణాలు ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి పూర్తి వైద్య సహాయం అందించాలనే ఉద్దేశంతో ఒక్కొక్కటి 3.60 కోట్ల రూపాయల ఖర్చుతో 10 ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటల్ (ఐసిటిసి) మొబైల్ వాహనాలను అందుబాటులోకి తీసురావడం జరిగిందన్నారు. మొబైల్ వ్యాన్‌లో వైద్య పరీక్షలకు అవసరమైన వైద్య పరికరాలతో పాటు ల్యాబ్ టెక్నీషన్ సిబ్బందిని నియమించడం జరిగిందని మొబైల్ వాహనాలు నేరుగా ప్రజల వద్దకు వెళ్ళి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు 25 లక్షల హెచ్ఐవి కేసులు నమోదయ్యాయన్నారు. కేవలం మన రాష్ట్రంలో 2.22 లక్షల మంది వ్యాధి బారిన పడిన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయన్నారు. 1998లో మన రాష్ట్రంలో 2.42 శాతంగా ఉన్న హెచ్ఐవి వ్యాధి సంఖ్య ప్రభుత్వ తీసుకున్న చర్యల కారణంగా 0.62 కు తగ్గించగలిగామన్నారు. అయిన్నప్పటికి పూర్తి స్థాయిలో వ్యాధిని నివారించి ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. హెచ్ఐవి వ్యాధి సోకిన వారిని మానవత దృక్పదం తో ఆదరించి వారికి మనోధైర్యం కల్పిస్తే జీవన ప్రామాణాలను పెంచిన వారమవుతామన్నారు. వ్యాధి లక్షణాలు కలిగిన వారు అనూన్యత భావనాన్ని విడనాడి ధైర్యంగా వైద్య పరీక్షలు నిర్వహించుకుని చికిత్స పొందన్నారు. 6 నెలల పాటు హెచ్ఐవి వైద్య చికిత్సలు పొందిన వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెల 4 వేల రూపాయలు పెన్షన్ అందజేస్తుందన్నారు. రాష్ట్రంలో 42 వేల



మంది పెన్షన్ సౌకర్యం పొందుతున్నారన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికి వైద్య ఆరోగ్య రంగానికి ఆర్థిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. టిబి, హెచ్ఐవి, కాన్సర్, కుష్ఠువ్యాధి, డయాబెటిస్ వంటి సంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారన్నారు. ఏటా 70 వేల మంది కన్సర్ బారిన పడగా 40 వేల మంది చనిపోతున్నారని దీనికి కారణం అవగాహన లోపమే అన్నారు. 6 నెలల నుండి 18 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి ప్రభుత్వం 40 రకాల వైద్య పరీక్షలను నిర్వహించి వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుందన్నారు. ప్రజల ముందుకే తీసుకువచ్చిన వైద్య పరీక్షల వాహనాల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ప్రజల జీవనశైలిలో మార్పులు రావాల్సి ఉందన్నారు. స్వచ్చంద సంస్థల సహకారం ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి. కృష్ణబాబు, ఏపిఎస్ఎసిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డా. ఎ. సిరి, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఏపిఎస్ఎసిఎస్ అడిషనల్ డైరెక్టర్ డా. సర్వసతి, జాయింట్ డైరెక్టర్లు డా. కామేశ్వర ప్రసాద్, డా. మంజూల, డా. భాగ్యలక్ష్మి, డా. శీరిష, డియంఅండ్‌హెచ్‌వో యం. సుహాసిని, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ ఆఫీసర్ డా.జె.ఉషారాణి, సిద్దార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. అశోక్ కుమార్, జిజిహెచ్ సుపరింటెండెంట్ జి.వెంకటేశ్వరరావు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ పద్మవతి పాల్గొన్నారు.

# 27న జీ తెలుగు సరికొత్త సీరియల్ ఎన్నాళ్లో వేచిన హృదయం ప్రారంభం

**అమరావతి, జనవరి 24, మేజర్ న్యూస్ :** జీ తెలుగు ఛానల్ ఆరంభం నుంచి ఆసక్తికరమైన అంశాలతో, ఆకట్టుకునే కాన్సెప్ట్తతో ఫిక్షన్, నాన్ ఫిక్షన్ షోలను అందిస్తూ తెలుగు ప్రేక్షకులకు వినోదం పంచుతోంది. ఊహించని మలుపులు, ఆసక్తికర కథనాలతో సాగే సీరియల్స్తో ఆకట్టుకుంటోన్న జీ తెలుగు మరో కొత్త సీరియల్తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆసక్తికరమైన కథ, కథనంతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ ఎన్నాళ్లో వేచిన హృదయం జనవరి 27న ప్రారంభం కానుంది. బాధ్యతలు, బంధాలే ప్రధానంగా సాగే అందమైన ప్రేమకథ ఎన్నాళ్లో వేచిన హృదయం సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 2:30 గంటలకు, మీ జీ తెలుగులో!




ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ త్రిపుర (తన్వియ) అనే ఒక స్కూల్ టీచర్, వ్యాపారవేత్త అయిన బాలకృష్ణ(చందు గౌడ) మధ్య సాగే కథతో రూపొందుతోంది. కారు ప్రమాదంతో మానసిక వైకల్యానికి గురైన బాలకృష్ణ ఆరోగ్యం బాగుపడేందుకు అతణ్ని రామాపురం తీసుకొస్తారు. కుటుంబ బాధ్యతలతో సాగుతున్న త్రిపుర జీవితం బాలతో ఎలా ముడిపడుతుంది? బాల ఆరోగ్యం బాగుపడేందుకు త్రిపుర ఏం చేసింది? ఇద్దరి జీవితాల్లో వచ్చే సమస్యలేంటి? అనే విషయాలు తెలుసుకోవాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ని మిస్ కాకుండా చూసేయండి!

ప్రతిభావంతులైన నటీనటులు, ఆకట్టుకునే కథతో తెరకెక్కుతున్న ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ జీ తెలుగు ప్రేక్షకులకు రెట్టింపు వినోదం అందించేందుకు సిద్ధమైంది. చందు గౌడ, తన్వియ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, ముంతాజ్, లక్ష్మణ్, ఉమ, కౌశల్, ప్రసాద్, కరాటే కళ్యాణి, విశ్వ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. అద్భుతమైన కథాంశం, ఆసక్తికరమైన మలుపులతో సాగే ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ మీరూ తప్పక చూడండి!



## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా
## ఆటో డ్రైవర్లు, వాహన దారులకు అవగాహన

**నందివాడ,మేజర్ న్యూస్:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా, హైకోర్టు ఆదేశాల ప్రకారం హెల్మెట్ ఉపయోగాన్ని తప్పనిసరి చేస్తూ, జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు ఆదేశాల మేరకు, నందివాడ ఎస్ఐ కె.శ్రీనివాసు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం జనార్ధనపురం సెంటర్లో ఆటో డ్రైవర్లు, వాహనదారులకు రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో పాటించవలసిన ముఖ్యమైన భద్రతా నియమాలు, వాహన పరిమితి, వేగం నియంత్రణ,, ప్రమాదాలను నివారించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. హెల్మెట్ యొక్క అవసరాన్ని తెలియజేస్తూ, ప్రతి డ్రైవర్ హెల్మెట్ ధరించడమే కాకుండా ఇతరులను కూడా ఈ నియమం పాటించమని వాహనదారులకు సూచించారు. వాహన నిర్వహణలో పాటించాల్సిన సదాచారాలు, బ్రేక్లు, లైట్లు, ఇతర భద్రతా పరికరాల ఉపయోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు, వాహనదారులకు భద్రతా నియమాలను గౌరవిస్తూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తాము అన్ని చర్యలు తీసుకుంటామని ఆటో డ్రైవర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు.



## బాలికల సంరక్షణ మన అందరి బాధ్యత

**కృత్తివెన్ను జనవరి 24 మేజర్ న్యూస్ :** బాలికల సంరక్షణ మన అందరి బాధ్యతని పల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు కొప్పినీడి సూర్య ప్రకాష్ అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ మాట్లా డుతూ సమాజంలో బాలికల సంరక్షణ,హక్కులు, ఆరోగ్యం, విద్య,సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బాలికల హక్కులపై నినాదాలు చేశారు.ఈ కార్య క్రమంలో యేసు బాబు, జె రాజ్య లక్ష్మి, మురళీ కృష్ణ, జి రాజ్య లక్ష్మి,అంగన్వాడీ వర్కర్లు ఎ.కమల,ఆర్. సరోజినీ దేవి,ఎన్.మహాలక్ష్మి,మహిళా కానిస్టేబుల్ జె.విజయలక్ష్మి, లక్ష్మీ పురం పి హెచ్ సి సిబ్బంది షహన,శ్రీనివాసరావు, ఎ యన్ ఎమ్ సత్యవతి,విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రమోషన్లు ఇచ్చి వెనక్కి తీసుకోవడం సరికాదు

## ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

**గన్నవరం, జనవరి 24, మేజర్ న్యూస్ :** మచిలీపట్నంలో కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఎస్సీ, ఎస్టీ, బీసీ-సీ అభ్యర్థుల చీఫ్ మేనేజర్ల ప్రమోషన్ల అంశం లో జరిగిన అన్యాయంపై చేస్తున్న ధర్నా కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సంఘీభావం తెలిపారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొని, బాధిత అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. సమస్య పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని... తక్షణమే ధర్నా ను విరమించాలని అభ్యర్థులను కోరారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ కృష్ణాజిల్లా చరిత్రలో ఎన్నడు లేని విధంగా సహకార బ్యాంకులో 100 ఉద్యోగాలను, 120 మందికి ఇంటెన్సివ్ ఇచ్చానని గుర్తు చేశారు. బ్యాంక్ వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావుల ఫొటో లు అన్ని బ్రాంచ్ లలో పెట్టేలా ఆదేశాలు ఇచ్చానని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ ఋణాలతో పాటు రైతు బిడ్డలకు విద్య రుణాలు ఇచ్చామని వెల్లడించారు. రైతు నేస్తం పథకం ద్వారా రైతులకు 1200 కోట్ల మేర రుణాలు ఇచ్చామని తెలిపారు. కరోనా సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్ ల కన్నా ఎక్కువ మొత్తంలో లోన్లు మంజూరు చేసామని కోవిడ్ ను సైతం లెక్కచేయకుండా ప్రాణాలకు తెగించి ఉద్యోగులు పనిచేశారని అన్నారు. తాను చైర్మన్ గా ఉన్న సంవత్సరం లో సహకార బ్యాంకు ను దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపామని వివరించారు. రాజకీయాల్లో ఉన్నంత వరకు బ్యాంకు బాగోగులు చూస్తూనే ఉంటానని బ్యాంక్ అంటే తనకు అంతా మక్కువ అని చెప్పుకొ



చ్చారు. బ్యాంక్ జీఎం, ఏసిబి కేసు ఎదుర్కొంటున్న రంగ బాబు వైసీపీ నేతలతో అంటకాగి.... కేసు మాఫీ చేసుకునేందుకు నేడు టీడీపీ వ్యక్తిని అని చెప్పుకుంటున్నారని ఆరోపించారు. బ్యాంక్ కు పట్టిన శని రంగబాబు అని దుయ్యబట్టారు. బ్యాంక్ ఉద్యోగుల కోసం జీతాలు పెంచేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉద్యోగుల పదోన్నతుల విషయంలో కూడా అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వంలో సహకార సొసైటీల్లో అనేక అక్రమాలు జరిగాయని వారిపై విచారణ జరపాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేయడంతో పాటు అసెంబ్లీ లో కూడా మాట్లాడానని చెప్పారు. తాను పని చేసిన 13 మాసాల సమయాన్ని కూడా కలుపుకుని 51 ఎంక్వరి వేసి నిజాలు నిగ్గు తెలుతాయి అన్నారు. ఎస్సి, ఎస్టీ అభ్యర్థులకు ప్రమోషన్లు ఇచ్చి వెనక్కి తీసుకోవడం సరికాదని భావిస్తున్నా న్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని... తక్షణమే ధర్నా ను విరమించాలని అభ్యర్థులకు కోరారు.

## డబ్ల్యుఈఎఫ్ గ్లోబల్ లైట్హౌస్ నెట్వర్క్లో చేరిన సియట్ చెన్నై ప్లాంట్



**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రముఖ భారతీయ టైర్ తయారీదారు సియట్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ లైట్హౌస్ నెట్వర్క్లో భాగంగా దాని చెన్నై ప్లాంట్ ద్వారా గుర్తింపు పొందడంతో ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ఈ ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని అందుకున్న ప్రపంచంలోనే మొట్టమొదటి టైర్ బ్రాండ్ సియట్. గ్లోబల్ లైట్హౌస్ నెట్వర్క్లో చెన్నై ప్లాంట్ చేరిక సియట్ యొక్క హలోల్ సౌకర్యం విజయంపై ఆధారపడి ఉంది. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి టైర్ సౌకర్యం. అటువంటి విశిష్టతను సాధించిన సియట్ యొక్క రెండవ సౌకర్యంగా గుర్తింపు పొందింది. ఈ విజయంపై ఆర్పీజీ గ్రూప్ వైస్ చైర్మన్ అనంత్ గోయెంకా మాట్లాడుతూ, చెన్నై ప్లాంట్ను డబ్ల్యుఈఎఫ్ లైట్హౌస్గా గుర్తించడం సియట్ కి ఒక గొప్ప మైలురాయి అని, ఇది ఈ ప్రతిష్ఠాత్మక నెట్వర్క్లో చేరిన తమ రెండవ సౌకర్యాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు.

## అధునాతన ఫీచర్లతో ఒప్పో రెనో13 సిరీస్




**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెనో13 సిరీస్ 5జీని ఒప్పో ఇండియా అధికారికంగా విడుదల చేసింది. స్మార్ట్ ఫోన్ అనుభవాన్ని పునర్నిర్వచించేలా దీన్ని తయారు చేశారు. దీనిలోని మీడియాటెక్ డైమెన్సిటీ 8350 ఎస్ఓసీతో శక్తినిచ్చే ఫ్లాగ్ షిప్ స్థాయి కెమెరా సిస్టమ్ను కలిగి ఉంది. ఇమేజింగ్, ప్రొడక్టివిటీ రెండింటినీ అందించేలా అత్యాధునిక ఏఐ ఫీచర్లు కలిగిన, రెనో13 సిరీస్ అసాధారణమైన పనితీరును అందించేలా తయారు చేశారు. తన అల్ట్రా డ్యూరబుల్ డిజైన్తో, ఈ సిరీస్ రెనో13, రెనో13 ప్రోతో సహా.. నీరు, ధూళి నిరోధకత కోసం ఐపీ66, ఐపీ68, ఐపీ69 సర్టిఫికేషన్లను కూడా కలిగి ఉంది. ఈ స్మార్ట్ఫోన్లు ఇప్పుడు మెయిన్లైన్ రిటైల్ అవుట్లెట్లు, ఒప్పో ఇ-స్టోర్, ఫ్లిప్కార్ట్ ద్వారా కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయి.

## మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్ను ప్రారంభించిన ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్



**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ ఫండ్ హౌస్లలో ఒకటైన ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్, ఈక్విటీ, డెట్, బంగారంలో పెట్టుబడి పెట్టే ఓపెన్ ఎండ్ స్కీమ్ అయిన ఎల్ఐసి ఎంఎఫ్ మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్ను ప్రారంభించింది. కొత్త ఫండ్ ఆఫర్ ఈ నెల 24న ప్రారంభమై ఫిబ్రవరి 7న ముగుస్తుంది. ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత ఇన్స్ట్రుమెంట్లు, డెట్, మనీ మార్కెట్ ఇన్స్ట్రుమెంట్లు, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల యూనిట్ల వైవిధ్యభరితమైన పోర్ట్ఫోలియోలో పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘకాలిక మూలధన పెరుగుదలను సృష్టించడం ఈ పథకం యొక్క పెట్టుబడి లక్ష్యమని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

## గౌడ కులానికి ఒక మద్యం షాపు



**కంచికచర్ల జనవరి 24 మేజర్ న్యూస్ :** స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వీరులపాడు మండలాని కి గౌడ కులాలకు సంబంధించిన రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా ఒక మద్యం షాపును కేటాయించడం జరిగిందని ఎక్సైజ్ సీఐ అఫ్రున్నిస్సా బేగం శుక్రవారం తెలిపారు.ఈ మద్యం షాపు నకు గౌడ కులాలకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకొనుటకు అర్హులన్నారు. గౌడ కులానికి సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రము, నివాస ధ్రువీకరణ పత్రము దరఖాస్తుతో పాటు జత పరచవల్సిందిగా సూచించారు. ప్రతి దరఖాస్తు రుసుము రెండు లక్షల రూపాయలు అని అవి తిరిగి చెల్లించబడని ఫీజుగా నిర్ణయించటం జరిగిందన్నారు. దరఖాస్తులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ కంచికచర్లలో కానీ ఆన్లైన్ ప్రక్రియలో కానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు ఈనెల 27వ తేదీ నుండి ఫిబ్రవరి 5వ తేదీ వరకు తీసుకొనబడతాయి అని వివరించారు. దరఖాస్తుదారులకు ఫిబ్రవరి 7వ తేదీన డ్రా తీయబడుతుందని అన్నారు. సదరు షాపు లైసెన్స్ దారులకు లైసెన్స్ ఫీజునందు 50 శాతం రాయితీ ఇవ్వబడుతుందన్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు మద్యం షాపుకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ కోరారు.



## కేడీసీసీ బ్యాంకు ఉద్యోగులకు విజయ్ సంఘీభావం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ధర్నా చేస్తున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కు డా బిఆర్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.శుక్రవారం మచిలీపట్నంలో బ్యాంకు ప్రధాన కార్యాల యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో డా బిఆర్ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మిడి విజయ్, నాయకులు గుంటూరు మహేష్ జవ్వాది రాజా, మాతంగి కిరణ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## కేశవరావు చిత్రపటం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే



**పామర్రు జనవరి 24 మేజర్ న్యూస్ :** పామర్రు మండలం కొరిమెర్ల గ్రామంలో శుక్రవారం జరిగిన వరుణ్ మోటార్స్ వ్యవస్థాపకులు వల్లూరుపల్లి కేశవ రావు చౌదరి వర్ధంతి కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశవరావు చౌదరి చిత్రపటానికి కుమార్ రాజా పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షులు వల్లూరుపల్లి గణేష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొట్టిపాటి లక్ష్మీదాస్ లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీరపనేనిగూడెం జడ్.పి.హెచ్ స్కూల్‌లో జాతీయ బాలిక దినోత్సవం



**గన్నవరం, జనవరి 24, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం వీరపనేని గూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ లో, శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ, వ్యాసరచన పోటీలు, బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వరమ్మ, అంగన్వాడి వర్కర్లు ఎం రమాదేవి, కే రాణి, పి అంజన, బి లక్ష్మీ పాల్గొన్నారు.

## కీసర టోల్ ప్లాజా వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం




**కంచికచర్ల జనవరి 24 మేజర్ న్యూస్ :** రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి పరీక్షా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులకే కాక టోల్ ప్లాజా మీదగా వెళుతున్న ప్రయాణికులకు కూడా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరం లక్ష్మి ఫౌండేషన్ హాస్పిటల్ చెందిన రాజారావు బృందంచే వైద్య పరీక్షలు జరిగాయి.ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్ జయప్రకాష్,సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్,, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛ గుడివాడ సాధించాలనే లక్ష్యంలో ఎమ్మెల్యేకు తోడ్పాటునందిస్తా

**స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్**

**డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు చర్యలకు హామీ**

**పురపాలక సంఘానికి కావలసిన వనరులపై ఎమ్మెల్యే వినతి**

**మహిళల కోసం మోడరన్ పింక్ టాయిలెట్లు ఏర్పాటుకు కృషి**





**గుడివాడ, మేజర్ న్యూస్:** సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు 100% ఇంటింటి చెత్త సేకరణ, చెత్త నిలువ లేకుండా ప్రాసెసింగ్ చేయడం, పేరుకుపోయిన చెత్తను తొలగించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గుడివాడ పట్టణంలో పర్యటించారు. గుడివాడ పట్టణంలో చెత్త సేకరణ విధానం, డంపింగ్ యార్డ్ విస్తీర్ణత, యార్డులో పేరుకుపోయిన చెత్త నిల్వల వివరాలను అధికారులు కార్పొరేషన్ చైర్మన్ కు వివరించారు. సమస్యల పరిష్కారం, పురపాలక సంఘానికి కావాల్సిన వనరులపై పట్టాభి రామ్ కు ఎమ్మెల్యే రాము వినతి పత్రాన్ని అందచేశారు. నందివాడ మండలం టెలిఫోన్ నగర్ వద్ద ఉన్న పురపాలక సంఘ డంపింగ్ యార్డ్ ను ఎమ్మెల్యే రాము, అధికారులతో కలిసి పరిశీలించారు. యార్డులో లక్షన్నర టన్నులకుపైగా చెత్త పేరుకుపోయిందని అధికారులు తెలుపగా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీనియర్ అధికారులతో మాట్లాడి డంపింగ్ యార్డ్ లో చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గుడివాడ అభివృద్ధికి సహకరించాలని అడిగిన వెంటనే వచ్చి అనేక సమస్యలపై సలహాలు ఇవ్వడమే కాకుండా స్వచ్ఛ గుడివాడ సహకారానికి సహకారం ఇస్తానని చెప్పిన పట్టాభికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. చెత్త మీద పన్నువేసిన చెత్త ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో 86 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో అక్టోబర్ 2 స్వచ్ఛ దివస్ నాటికి పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు శ్రీకారం చుట్టామని, ఆ దిశగా ఇప్పటికే 50వేల టన్నుల చెత్తను తొలగించినట్లు తెలియచేశారు. ఇంటింటి చెత్త సేకరణకు క్లాప్ వాహనాలను తిరిగి అందుబాటులోకి తీసుకొస్తామని, త్వరలో ఎలక్ట్రానిక్ వాహనాలను కూడా వినియోగిస్తామన్నారు. గుడివాడలో ప్రతిరోజు 61టన్నుల చెత్తను సేకరిస్తున్నట్లు గుర్తించామని, రోజువారి సేకరించే చెత్తను, నిల్వ చేయకుండా చెత్త నుండి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లకు తరలించేలా ఏర్పాట్లు చేస్తామని పట్టాభిరాం పేర్కొన్నారు. పురపాలక సంఘానికి కావలసిన పనిముట్లు, యంత్ర పరికరాలపై ఎమ్మెల్యే ఇచ్చిన వినతి పత్రంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అమృత్ ఫేస్ 2లో భాగంగా గుడివాడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి డిపిఆర్లు సిద్ధం చేశామని కూడా పట్టాభి వెల్లడించారు. గుడివాడలో మినీ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి తడి, పొడి చెత్తను వేరుచేసి సంపద సృష్టించే ప్రక్రియలను నిర్వహించడమే కాక, చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు పట్టణంలోని అవసరమైన ప్రాంతాల్లో మహిళల కోసం పింక్ మోడ్రన్ టాయిలెట్స్ ను కార్పొరేషన్ తరపున ఏర్పాటు చేస్తామని పట్టాభి తెలియచేశారు. పట్టాభిరామ్ పర్యటనలో గుడివాడ మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీనియర్ ఫైనాన్స్ మేనేజర్ విజయ్ ప్రసాద్, మున్సిపల్ ఎంఈ వరప్రసాద్, టిపిఓ ఏసుబాబు, ఏవో నాయుడు, టీడీపీ నాయకులు పెద్దు శ్రీకాంత్, చేకూరు జగన్మోహన రావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ లేఅవుట్ల పై ఉక్కుపాదం



**కంచికచర్ల జనవరి 24 మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోనూ మండలంలోని గ్రామాల్లో అనధికారికంగా ఏర్పాటుచేసిన అక్రమ లే అవుట్ల పై తాసిల్దార్ జాహ్నవి ఉక్కు పాదం మోపుతామన్నారు. స్థానిక అనధికార లే అవుట్ లకు నోటీసులు ఇచ్చి వెంటనే తొలగిస్తామని తాసిల్దార్ తెలిపారు.సి ఆర్ డి ఏ అనుమతి లేకుండా అక్రమంగా లేఅవుట్లు వేసిన స్థలాలను ఆమె సిబ్బందితో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ కంచికచర్ల చుట్టుపక్కల గ్రామాలలో, కంచికచర్ల పట్టణం చుట్టూ ఏర్పాటు చేసిన అక్రమ లేఔట్లను పరిశీలించడం జరిగిందన్నారు. కంచికచర్ల ప్రాంతంలో ఎక్కువ శాతం అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు. అక్రమ లేఅవుట్లు వేసి ప్రజలను మోసం చేసి ఆ స్థలాలను అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అక్రమ లే అవుట్ వేసిన రియేటర్లు వాళ్లే స్వయంగా లేఅవుట్ ను తొలగిస్తే బాగుంటుంది అని లేకపోతే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సురేష్ పాల్గొన్నారు.

# గంజాయి వాడిన, రవాణా చేసిన సహించేది లేదు



**నందిగామ సబ్ డివిజన్ ఏసిపి తిలక్**

**కంచికచర్ల జనవరి 24 మేజర్ న్యూస్ :** కంచికచర్ల పోలీసు స్టేషన్ పరిధిలో గురు, శుక్రవారాలలో పోలీసులు వాహనాల తనిఖీ లలో రెండు వేర్వేరు చోట్ల 10 కేజీల గంజాయిని, ఒక కారు, రెండు బైక్ లను, 8 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకుని 13 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎసిపి తిలక్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిందితులను, స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనాలను పాత్రికేయుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ నందిగామ సబ్ డివిజన్ పోలీస్ పరిధిలో గంజాయి వాడిన,రవాణా జరిపిన సహించేది లేదని శాఖా పరమైన చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. గంజాయి తరలిస్తున్న మూలాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గతంలో గంజాయి రవాణా కేసులలో ఉన్నవారిపై ఖచ్చితంగా నిఘా ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. కంచికచర్ల మండలంలో ఎక్కువగా ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయని, ఇక్కడ విద్యార్థులకు గంజాయి మూలాలు లేకుండా చేస్తామని తెలిపారు. అదే సమయంలో గత వారం పదిరోజుల లో నందిగామ, చిల్లకల్లు పోలీసు స్టేషన్ల పరిధిలో దాదాపు ఐదు వందల కేజీల గంజాయిని, పలు వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని అన్నారు. కంచికచర్ల కేసు కు సంబంధించిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం పరిటాల శివారు ఒక రియల్ ఎస్టేట్ వెంచర్ లో ఒక కారును ఆపి అనుమానాస్పదంగా ఉన్న ఏడుగురు వ్యక్తులను అదుపు లోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఈ గంజాయిని వారు చిన్న చిన్న పొట్లాలు కడుతున్నట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆరు కేజీల గంజాయి, ఒక కారు ఏడుగురు వ్యక్తులను ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే శుక్రవారం ఉదయం జుజ్జూరు రోడ్డులో వాహనాలను తనిఖీ చేపట్టగా రెండు బైక్ లపై ఆరుగురు వ్యక్తులు పోలీసులను చూసి పరారీ అయ్యేందుకు ప్రయత్నించారని, వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు కేజీల గంజాయిని, రెండు ద్విచక్ర వాహనాలను, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ రెండు కేసులు పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 2.5 లక్షలు అని తెలిపారు. రెండు సంఘటనలకు సంబంధించి కేసులు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఏసిపి ఎబిజి తిలక్ తో పాటు నందిగామ రూరల్ ఇన్స్పెక్టర్ సిఐ, నందిగామ సిఐ వైవిఎల్ నాయుడు, కంచికచర్ల ఎస్సై బోనగిరి రాజు, వీరుల పాడు ఎస్ఐ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారంలో భాగస్వామ్యంతోనే సమస్యలు తీర్చడంలో ముందున్నాం



## అన్ని స్థాయిల్లో పద్ధతి ప్రకారం పదవుల నిర్ణయం

## వారధి కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్

**విజయవాడ మేజర్ న్యూస్ :** అధికారంలో భాగస్వామ్యం ఉంది కాబట్టే ప్రజా సమస్యలు తీర్చడంలో ఏపి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ మందున్నామన్నారు. అన్ని స్థాయిలలో వ్యవస్థలో పద్ధతి ప్రకారం పదువుల నిర్ణయం జరుగుతుందన్నారాయన. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన వారధి కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భం గా పలు జిల్లాల నుంచి వచ్చిన వారి నుంచి మంత్రి వినతులు స్వీకరించి పరి ష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు లాంటి కార్యక్రమాలతో సమస్యలు తగ్గుతాయన్నారు. ముఖ్యంగా నేషనల్ హెల్త్ మిషన్ ని పొడిగించడం ద్వారా పలు లాభాలు కలుగుతాయన్నారు. అదేవిధంగా కేన్సర పరీక్షలు నిర్వహించడం, కమ్యూనికబుల్ వ్యాధుల గురించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సూర్యఘర్ ద్వారా ప్రతీ ఇంటికి ఆదాయ వనరుగా మార్చే పనులు చేస్తున్నామని, నిత్యం ప్రజలలోకి వెళ్ళాలని, 2030 నాటికి 500 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. పిపిపి మోడ్‌లో మెడికల్ కాలేజీలు తేవాల్సిన పరిస్థితికి గత ప్రభుత్వం కారణమని, నిధులు సరిగా ఇవ్వకుండా కాలేజీల నిర్మాణం జరగకపోవడానికి గత ప్రభుత్వం కారణమన్నారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీలో విద్యార్థినుల హాస్టల్ లేదని, పి4 మోడల్ లో మెడికల్ కాలేజీలు వచ్చిన దానికి తగిన ఫ్రీ సీట్లు ఉంటాయన్నారు. వారధి కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ, వారధి సమన్వయ కర్త కిలారు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాది







**పామర్రు జనవరి 24 మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమైన పునాదులని, అటువంటి వారిని కాపాడుకునేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రు నియోజకవర్గ పరిధిలోని తోట్లవల్లూరు మండలం గరికపర్రు గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ గత ఎన్నికలలో మండల పరిధిలో తెలుగుదేశం పార్టీకి అత్యంత మెజార్టీ వచ్చేందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను తాను జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు. గతంలో ఎన్నడూ ఈ మండలంలో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ రాలేదని అటువంటి మండలంలో మండల పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్ నేతృత్వంలో కార్యకర్తలు సైనికుల వలె పనిచేసి తనకు మెజార్టీని కట్టబెట్టడం మర్చిపోలేనిదన్నారు. ఇదే పోరాట పటిమను ముందు ముందు కూడా కొనసాగించి రానున్న పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లోను, అలాగే స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పట్టు నిలుపుకునేలా కృషి చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని తాను వాటిని పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గత సాధారణ ఎన్నికలలో తాను ఈ నియోజకవర్గంలో పరిశీలకునిగా పనిచేశానన్నారు. ఆ సమయంలో మండలంలో నాయకులు, కార్యకర్తలు పడిన కృషిని, కష్టాన్ని ప్రత్యక్షంగా చూశానన్నారు. ఎన్నడూ లేని విధంగా మండలంలో అత్యధిక మెజార్టీని తెలుగుదేశం పార్టీ సాధించడం వెనుక నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. ఇదే కృషి, పట్టుదలను కొనసాగిస్తూ పార్టీని మండలంలో మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల పార్టీ కార్యదర్శి ఈడే రేణుకారావు, పార్టీ నాయకులు నెక్కలపు మురళి, కళ్లెం వంశీకృష్ణారెడ్డి, మండలంలోని గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, పలువురు సీనియర్ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు

**గన్నవరం (ఉంగుటూరు), జనవరి 24, మేజర్ న్యూస్ :** గురువారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలోని శ్రీ భీమవరపు కృష్ణ మోహన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సుని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమములో నేతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్ జాకబ్ రాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం కేవలం మీ భవిష్యత్తు ను మాత్రమే కాదు, మీ కుటుంబ సభ్యుల భవిష్యత్తును కుడా ప్రమాదం లోకి నెట్టుతుంది. మత్తుపదార్థాలైన ఆల్కహాల్, పొగాకు, గంజాయి లాంటివాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా యువత వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వాటికి అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు, మొదట్లో సరదాగా తీసుకునే మత్తపదార్థాలు క్రమేపీ నియంత్రణ కోల్పోయి మత్తుకు బానిసలు అవుతారనిన్నారు అని, చెడు అలవాట్లు అనేవి ఒకరు నుంచి ఒకరు అలవాటు పడి తీవ్ర ప్రమాదస్థాయికి చేరుకుంటరని, క్యేన్సర్, ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని స్నేహితులు కానీ మరి ఏ ఇతర వ్యక్తులు కానీ మాదక ద్రవ్యాలపై ప్రలోభపెడితే కచ్చితంగా వద్దు అని చెప్పాలని, మత్తు పధార్థాలతో బ్రతుకు దుర్భరం చేసుకోవద్దు అని, మత్తుపదార్థాల వలన ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామని తెలిపారు. సరి అయిన అవగాహన లేక మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న వారు ఎక్కువ మంది వున్నారని, ముందుగానే సరి అయిన అవగాహన పెంచుకొని జీవితాలను చక్క దిద్దికోవాలన్నారు. ఈ అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. అనంతరం ఉంగుటూరు పోలీస్ స్టేషన్ నుండి కానిస్టేబుల్ కిరణ్ కుమార్, నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్స్ ఎస్ కే నజ్మ, డి విజయారాణి మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువత ను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చు అని ఈ చికిత్స అందించేందుకు ‘నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడులో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసింది అని ఈ లాంటి సమస్యలతో ఉన్నవిద్యార్థులకు, యువతకు నూజివీడు మండలం పొలసానపల్లి లో ఏర్పాటు చేసిన “ బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని” ఉచితంగా సంప్రదించవచ్చు అని సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490 492020 అని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి వి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని, ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవజీవన్ బాల భవన్ వారికీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమములో తేలప్రోలు గ్రామ అంగన్ వాడి కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.





## ఉపాధి కింద ఈ సీజన్లో చేపట్టాల్సిన పనులపై అవగాహన

### రోజుకు 600 మందికి పని చూపాలని సూచన

**గుడివాడ, మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ సీజన్లో చెపట్టాల్సిన పనులపై ఎంపీడీఓ విష్ణు ప్రసాద్ ఆశాఖ సిబ్బంది, క్షేత్ర సహాయకులకు శుక్రవారం తన ఛాంబర్ లో దిశా నిర్దేశం చేసారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన పనులను వెంటనే మొదలెట్టాలన్నారు. కనీసం రోజుకు 600మంది కన్నా పనిచూపాలని లక్ష్యంగా నిర్ణయించామని, ఆదిశగా పనిచెయ్యాలన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు సరైన పని కల్పించడం, జరుగుచున్న సీసీ రోడ్లు, గోకులాల షెడ్లు నిర్మాణాలు పనులలో కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించడం చెయ్యాలన్నారు. ఇవేకాకుండా ఈ పథకం కింద చేపట్టే వివిధ రకాలైన పనులపై కూడా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సూచనలు చేసారు. ఈ సమీక్షలో ఏపీఓ దేవానంద రాజు, జేఈ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పరిటాల రవి వర్ధంతి



**కంచికచర్ల జనవరి 24 మేజర్ న్యూస్ :** స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పరిటాల రవి వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి పరిటాల రవి 20వ వర్ధంతిని పురస్కరించుకొని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు తదితర నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలు గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల దేశం పార్టీ అధ్యక్షులు గుత్తా వెంకటరత్నం, పట్టణ పార్టీ అధ్యక్షులు వేమా వెంకటరావు, బుడ్డి సూర్య ప్రకాష్, గుర్రం రామకృష్ణ, రఫీ, నరసింహారావు, పుల్లగూర బాబు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### డీపీటీవో వి.వాణిశ్రీ





**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లి బస్టాండ్లో ఆర్టీసీ కార్గో సేవలను చల్లపల్లి పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారిణి వి. వాణిశ్రీ అన్నారు. శుక్రవారం చల్లపల్లి బస్ స్టాండ్ లోని ఆర్టీసీ కార్గో కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ, చల్లపల్లి, గ్రామాల ప్రజల సౌకర్యార్థం చల్లపల్లి ఆర్టీసీ బస్టాండ్లో ఆర్టీసీ కార్గో, కొరియర్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన, వేగవంతమైన సేవలు ఆర్టీసీ కార్గో ద్వారా అందిస్తున్నామన్నారు. వ్యాపార సంస్థల యజమానులు, ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలన్నారు. చల్లపల్లి బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. బస్టాండ్కు వచ్చివెళ్లే ఆర్టీసీ బస్సులను పరిశీలించి డ్రైవర్లతో మాట్లాడారు. జిల్లా ఆర్యవైశ్యసంఘం ఉపాధ్యక్షునిగా మొగిలేశ్వర గుప్తా చల్లపల్లి మేజర్ న్యూస్ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షునిగా వ్యాపారవేత్త, సేవాతత్పరుడు విస్సంశెట్టి మొగిలేశ్వర గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సన్నిధి నాగ సాయి శ్రీనివాస్ (సాయి) నియామక ఉత్తర్వులు అందచేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉండే గుప్తా జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షునిగా నియమితులు కావటంతో పలువురు ప్రముకులు సన్మానించారు. చల్లపల్లి ఎస్ఐ పివిస్వి. సుబ్రహ్మణ్యం, విశ్రాంత డీఎస్పీ కె.హరిరాజేంద్రబాబు, జనసేన నేతలు అడపా రాంబాబు, గంగిశెట్టి రాజేంద్ర, ఎం.రంజిత్ కుమార్, ఉరిమి మణికాంత్, ఆర్యవైశ్య సంఘం నేతలు వరదా చంద్రం, విస్సంశెట్టి ధనుంజయరావు, హరీష్ తదితరులు ఉన్నారు.

## సీఎంకి ఘన స్వాగతం పలికిన మంత్రి రవీంద్ర



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వేలకోట్ల పెట్టుబడులు, పదుల సంఖ్యలో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకుని రాష్ట్రానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి,రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఘన స్వాగతం పలికారు. గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరించి, మైక్రో సాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ లాంటి ప్రముఖులతో ఒప్పందాలు చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అగ్రపథంలో నిలపాలనే తపన,మన రాష్ట్రంలోని మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలనే చంద్రబాబు ఆశయం అజరామరం అన్నారు.బ్రాండ్ ఏపీ నినాదంతో సాగిన దావోస్ పర్యటన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు దోహదపడు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబు లాంటి తపన కలిగిన నాయకులను చూస్తుంటే మనసు ఉప్పొంగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## చంద్రబాబుకు స్వాగతం పలికిన తంగిరాల సౌమ్య



**నందిగామ, జనవరి 24, మేజర్ న్యూస్:** దావోస్ పర్యటన ముగించుకుని ఏపీకి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి గన్నవరం విమానాశ్రయం, ఉండవల్లి నివాసం వద్ద ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అవనిగడ్డ సబ్ జోన్ పోటీలకు విరాళం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ స్థాయిలో తలగడదీవి గ్రామంలో జరుగుతున్న బాలుర సబ్ జోన్ పోటీల బహుమతుల కోసం తెలుగుదేశం నేత, పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ రూ. 25000 విరాళంగా అందించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధి కోసం ఇక్కడి వ్యాయామోపాధ్యాయులు చేస్తున్న కృషి కారణంగా నియోజ కర్గ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని వారిని ప్రోత్సహిం చాలన్న ఉద్దేశ్యంతో బహుమతుల కోసం ఈ మొత్తాన్ని అంది స్తున్నట్లు గోవర్ధన్ తెలిపారు.. నాగాయలంక మండలానికి చెందిన ఉపాధ్యాయుడు చెన్ను రామకృష్ణ ద్వారా ఈ మొత్తాన్ని తలగడదీవి పాఠశాల ప్రధానోపాధ్యా యుడు బీ శివరామ ప్రసాద్‌కు అందచేయగా ఈ కార్యక్రమంలో పీడీ సుబ్బా రావు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా వ్యాయామోపాధ్యాయుల తరుపున గోవర్ధన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఏపీఎస్ఆర్టీసీ అవనిగడ్డ డిపోలో తమ సమస్యలను డిపో మేనేజర్ హనుమంతరావు స్పందించి పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ నేతలు నిరసన తెలియజేశారు, శుక్రవారం డిపో కార్యదర్శి ఎం మహేశ్వరరావు మాట్లాడుతూ డిపోలో ఉన్న సమస్యలపై డిపో మేనేజర్ కి గతంలో పలుమార్లు వినతి పత్రం సమర్పించినప్పటికీ ఏ విధమైనటువంటి స్పందన లేదని దీనితో ఉదయం నుండి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎరుపు బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలియజేస్తున్నామని అన్నారు, అక్రమ చార్జిషీట్లు పనిష్మెంట్లు వెంటనే రద్దు చేయాలని తమకు నచ్చిన వారికి డ్యూటీలు బుక్ చేసి స్పేర్ ఉన్న వారి చేత బలవంతంగా లీవులు రాయించుకుంటున్నారని బస్సులను సకాలంలో డ్యూటీ కి ఇప్పించాలని బస్సుల కండిషన్ మెరుగుపరచాలని కోరారు,

# భద్రత మాసోత్సవాలు సందర్భంగా అవగాహన సదస్సు



**నందిగామ, జనవరి 24, మేజర్ న్యూస్ :** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సంధర్భంగా నందిగామ పరిదిలో గ బోస్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న, బోస్, అన్నపూర్ణ హెవి మోటార్ వెహికల్ డ్రైవరుల కు రోడ్డు భద్రత నియమాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. అని ఆర్టీవో. యం.పద్మావతి తెలిపారు. ఈ సంధర్భంగా ఆర్టీవో యం.పద్మావతి మాట్లాడుతూ వాహనములు అతి వేగముగా నడపడము వలన, ప్రమాదకరముగా వాహనములను ఓవర్టేక్ చేయడము వలన ప్రమాదాలు జరుగుతాయని, కావున రోడ్డు పై న ప్రయాణము చేసేటప్పుడు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించడము వలన ప్రమాదాలు జరగవని తెలిపారు. జగ్గయ్యపేట మోటార్ వాహన తనిఖీ అధికారఎంవిఎన్ రాజు మాట్లాడుతూ వాహనము ఓవర్ టేక్ చేసేటప్పుడు కుడి వైపు మాత్రమే చేయవలెను అని, రాంగ్ డైరక్షన్ లో ప్రయాణము చేయకూడదు అని, సింగల్ రోడ్డు లో ఓవర్ టేక్ చేయకూడదు అని, మత్తు పదార్ధాలు సేవించి డ్రైవింగ్ చేయకూడదు అని సూచించారు. నందిగామ మోటార్ వాహన తనిఖీ అధికారి యం. పూర్ణిమ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించే దిశగా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

తదుపరి నందిగామ బైపాస్ రోడ్డు లో పోలీస్ రవాణాశాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ డ్రైవ్ పైన అవగాహన కార్య క్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నందిగామ ఏసీపీ తిలక్, సి ఐ వై వి వి నాయుడు, యస్ ఐ అభిమన్యు, ట్రాఫిక్ యస్ ఐ నరేష్ ప్రాంతీయ రవా ణా శాఖాధికారి యం.పద్మావతి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎంవి నారాయ ణరాజు, మోటార్ వాహన తనిఖీ అధికారి యం. పూర్ణిమ, పరిపాలన అధికా రి బి ఎస్ కే ప్రభాకర లింగం, బోస్ మేనేజర్ సుభాని, టి ఎస్ సి బోస్ డ్రైవిం గ్ స్కూల్ విధ్యార్ధులు, అన్నపూర్ణ డ్రైవింగ్ స్కూల్ విధ్యార్ధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా కర్పూర్ ఠాగూర్ 101వ జయంతి వేడుకలు

**గుడివాడ, మేజర్ న్యూస్ :** జననాయక్ బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూర్ ఠాగూర్ బలహీనవర్గాల అభివృద్ధికి విశేష కృషి చేసారని, ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు నాని, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి అన్నారు. గుడివాడ బంటుమిల్లి రోడ్డులోని నాగన్న సత్రం కళ్యాణ మండపంలో శ్రీసాయి నాయీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు దేవరపల్లి కోటి ఆధ్వర్యంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూర్ ఠాగూర్ 101వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కర్పూర్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమములో సంఘ పెద్దలు వడ్డాది ప్రసాద్, మాతాజీ, అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి




**నందిగామ, జనవరి 24, మేజర్ న్యూస్:** పట్టణ శివారు వై జంక్షన్ దగ్గర హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసే వారిని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ తిలక్ మాట్లాడుతూ చాలామంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించని కారణంగానే రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని తెలిపారు. హెల్మెట్ లేని కారణంగా తలకు తీవ్ర గాయాలయి ప్రాణాలు కోల్పోతున్నారని హెల్మెట్ ధరించడంతో కలిగే ప్రయోజనాలను వాహనాదారులకి వివరించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డుపై ప్రయాణం చేసి గమ్యానికి చేరుకోవాలని తెలిపారు.సీఐ వైవిల్ నాయుడు మాట్లాడుతూ యువత రోడ్డు ప్రమాదాలపై అవగాహన ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని తెలిపారు. రోడ్డుపై ద్విచక్ర వాహనం వస్తే తప్పనిసరిగా హెల్మెట్ తోనే రావాలని తెలిపారు.అనంతరం మద్యం సేవించి, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్ధాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనల ప్రకారం వాహనదారులు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందిగామ పట్టణ ఎస్ఐ అభిమన్యు, ట్రాఫిక్ ఎస్సై నరేష్, ఇన్స్పెక్టర్ పూర్ణిమ పోలీస్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సచివాలయ పోలీస్ పాల్గొన్నారు.

## ఢిల్లీలో జరిగే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు గుడివాడ ఆంధ్ర కేసరి విద్యార్థి సిరి



**గుడివాడ, మేజర్ న్యూస్:** ఢిల్లీలో జరిగే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు గుడివాడ ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పాఠశాల విద్యార్థి సిరికి అహ్వానం వచ్చినట్లు గుడివాడ డివైఈవో పద్మారాణి శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వంచే ఎర్రకోట(ఢిల్లీ)లో ప్రతిష్టాత్మకంగా జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆంధ్ర కేసరి టాగుంటూరి ప్రకాశం మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న ఎన్సిసి విద్యార్ధిని గోపిశెట్టి సిరి ఆంధ్ర, తెలంగాణ డైరెక్టరేట్ జూనియర్ వింగ్ నుండి ప్రాతినిధ్యం వహించునట్లు తెలిపారు. ఎన్సీసీ ట్రూప్లో 4వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్లో సిరి పేరు నమెదు చేసుకోవడం, జూలై నెలలో జరిగిన రిపబ్లిక్ డే పెరేడ్ సెలక్షన్స్లో పాల్గొని అర్హత సాధించినట్లు తెలిపారు. దాదాపు మూడు నెలలు గణతంత్ర క్యాంపులలో శిక్షణ తీసుకొని గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. సిరి ఉన్నతకి కృషి చేసిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ అసోసియేట్ ఎన్సిసి అధికారిణీ 2 అనురాధ, 4ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఐలేందర్సింగ్, బెటాలియన్ ఆడమ్ ఆఫీసర్ మేజర్ స్వాతి పాండే, ప్రధానోపాధ్యాయిని ప్రమీలారాణి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.ఉమామహేశ్వరరావు పాఠశాల సిబ్బంది అభినందించారు.

### సమాజం కోసమే జీవించిన

# మహా మనిషి పరిటాల రవి



**నందిగామ, మేజర్ న్యూస్:** నందిగామ పట్టణం కాకాని నగర్ కార్యాలయంలో శుక్రవారం నాడు టీడీపీ సీనియర్ నేత మాజీ మంత్రి పరిటాల రవి వర్ధంతి సందర్భంగా కూటమి నేతలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాతో ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ సాహసమే ఊపిరిగా పేద ప్రజల పక్షాన అలుపెరగని పోరాటం చేసిన యోధుడు, బడుగు బలహీన వర్గాల కోసం కృషి చేసిన నేత, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటారు. పరిటాల రవి వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సత్ప్రవర్తనపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన



## ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఘంటసాల, మేజర్ న్యూస్ : సత్ ప్రవర్తన పై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన బౌద్ధ గురువు పూజ్య దమ్మదుజ బంతేజీ కల్పించారు. శుక్రవారం ఘంటసాలలో ప్రాచీన బౌద్ధ స్థూపం వద్ద ధమ్మ ధజ బంతేజీ ఆధ్వర్యంలో గౌతమ బుద్ధునికి ప్రత్యేక పూజలు, స్థూప ప్రదక్షిణ, సధమ్మ ఉపోసత క్యాలెండరు, బౌద్ధ బోధనల కరపత్రం ఆవిష్కరణ, 120 మంది విద్యార్థులకు సత్ప్రవర్తనపై అవగాహన కలిగించి ధ్యాన సాధన చేయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రసంగిస్తూ అన్ని రంగాల్లో విలువలు కోల్పోతున్న నేపథ్యంలో బౌద్ధ ధర్మంతోనే విలువల పునరుద్ధరణ సాధ్యమన్నారు. బౌద్ధాన్ని స్వీకరించకపోయినా బౌద్ధాన్ని ఆచరించాలని సూచించారు. యువతకు ఉత్తమ వ్యక్తిత్వాన్ని బౌద్ధ ధర్మం అందిస్తుందన్నారు. ఘంటసాల లాంటి చారిత్రక గ్రామం ఉన్న నియోజకవర్గానికి తాను ప్రజాప్రతినిధిగా ఉండటం తన అదృష్టం అన్నారు. దివిసీమకు ఉన్న చారిత్రక వారసత్వ సంపద మరే ప్రాంతానికి లేదన్నారు. దివిసీమ మహోన్నత చరిత్రను యువత, విద్యార్థులు అందిపుచ్చుకుని భవిష్యత్ చరిత్ర నిర్మాతలు కావాలన్నారు. జన్మభూమిని మరువకుండా స్వగ్రామానికి సేవ చేస్తున్న గొర్రెపాటి రంగనాథబాబు సేవలు స్ఫూర్తిదాయకం అన్నారు. ఘంటసాలలో బౌద్ధ ధర్మం ప్రాముఖ్యత నేటి తరానికి తెలియ చెప్పేందుకు, బౌద్ధ అభివృద్ధికి ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథబాబు చేస్తున్న కృషి విశేషం అన్నారు. బుద్ధుని గుర్రం అయిన కంటక పేరుతో ఏర్పడిన గ్రామం కంటకశైల కాలక్రమేణా ఘంటసాలగా మారిందని, బౌద్ధ స్థూపంతో పాటు అపురూపమైన బౌద్ధ శిల్పాలకు నిలయం ఘంటసాల గ్రామం అని తెలిపారు. బౌద్ధపరంగా విశిష్టమైన ప్రాంతంగా ఉన్న ఘంటసాల గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించి గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు శయన బుద్ధప్రాజెక్టు మంజూరు చేయగా, ప్రాజెక్టు ఏర్పాటుకు అనువైన కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని గొర్రెపాటి రంగనాథబాబు ప్రభుత్వానికి ఉదారంగా ఇచ్చారన్నారు. తద్వారా మొదలైన ప్రాజెక్టు నిర్మాణ పనులు గత వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో ఐదేళ్లపాటు ముందుకు సాగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ కూటమి ప్రభుత్వంలో శయన బుద్ధ ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఘనంగా నిర్వహించిన బుద్ధ జయంతి వేడుకలు కూడా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరగకపోవడం బాధాకరం అన్నారు. ఈ ఏడాది మే నెలలో బుద్ధ జయంతి వేడుకలు ప్రభుత్వం ద్వారా ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ, గొర్రెపాటి వెంకట్రాయులు - ఉదయ భాస్కరమ్మ ట్రస్ట్ చైర్మన్ గొర్రెపాటి రంగనాథబాబు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మానవ హక్కుల సంఘం జాతీయ నాయకులు పిసుపాటి విశ్వనాథం, డీసీ చైర్మన్ అయినంపూడి భానుప్రకాష్, టీడీపీ నాయకులు బండి పరాత్పరరావు, గొర్రెపాటి వెంకట నరసింహారావు (చంటిబాబు), ట్రస్ట్ సభ్యులు కొండపల్లి రామకృష్ణ, జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రైస్తవుడు సమాజానికి ఆదర్శంగా ఉండాలి





కృత్తివెన్ను జనవరి 24 మేజర్ న్యూస్ : క్రైస్తవుడు సమాజానికి ఆదర్శంగా ఉండాలని హైదరాబాద్ నగరానికి చెందిన పాస్టర్ జెర్మియా పేర్కొన్నారు. కృత్తివెన్ను ఇమ్మానియేల్ చర్చ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కృత్తివెన్ను,పల్లెపాలెం గ్రామంలో క్రీస్తు శుభ సందేశ దీవెన పండుగలు రెవరెండ్ బి వి డేనియల్ రాజు అధ్యక్షతన అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు రెండవ రోజు గురువారం రాత్రి హైదరాబాద్లో పరిచర్య చేస్తున్న పాస్టర్ జెర్మియా దైవ సందేశాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ క్రైస్తవులు సమాజానికి ఆదర్శంగా ఉండటమే కాకుండా మార్గ నిర్దేశకులుగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభువైన ఏసుక్రీస్తు తన జీవితంలో మానవులు ఎలా జీవించాలి అనేది నేర్పించి వెళ్లారని ఆయన చూపిన మార్గంలో మనందరం పయనించాలని కోరారు. క్రైస్తవులు సమాజంలో చెడ్డ పేరు తెచ్చుకునే విధంగా ప్రవర్తించకూడదని అలా ప్రవర్తిస్తే దేవుని నామానికి మహిమ రాదని క్రైస్తవులైన మనము దేవునికే మహిమ వచ్చు విధంగా మన ప్రవర్తన సరిజేసుకుని సమాజం పట్ల మంచి దృక్పథంతో జీవితాన్ని కొనసాగించాలని తెలిపారు. ఈ లోకంలో పాపానికి దూరంగా ఉంటూ పరిశుద్ధంగా జీవించాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభలో ఇమ్మానియేల్ చర్చ్ క్వయర్ వారు ఆరాధన, సుమధుర సంగీతాలు అందించారు. కృత్తివెన్ను జడ్పిటిసి మైల రత్నకుమారి సభలలో పాల్గొని ప్రత్యేక గీతాలను ఆలపించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.



# కావడి సేవలో భక్తులంతా హాజరు కావాలి

## మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం మేజర్ న్యూస్ : శ్రీ కార్తికేయ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మచిలీపట్నం కేంద్రంగా ఫిబ్రవరి 11న జరిగే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కావడి సేవ నగరోత్సవం, మహా పాశుపతాస్త్ర హోమమునకు సంబంధించిన కరపత్రాలను రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం శ్రీ కార్తికేయ సేవా ట్రస్ట్ కు సంబంధించిన వెబ్ సైట్ ను ప్రారంభించారు.ఫిబ్రవరి 11న మచిలీపట్నం జిల్లా పరిషత్ వద్ద నుండి నిర్వహించే కావడి సేవలో భక్తులంతా హాజరు కావాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.

# "బేటి బచావో - బేటి పడావో" అవగాహన



ఘంటసాల, మేజర్ న్యూస్: మండల పరిధిలోని గొగినేనిపాలెం జడ్పీ హైస్కూల్లో జాతీయ బాలిక దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గొగినేనిపాలెం ఆరోగ్య సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది సంయుక్తంగా జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమాన్ని పాఠశాల విద్యార్థినిల సమక్షంలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ప్రసంగిస్తూ సమాజంలో లింగ వివక్షత విడనాడాలని, బాలురతో పాటుగా బాలికలు కూడా చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని, అలాగే సమాజంలో బాలికలు నేడు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందుల నుండి ఏవిధంగా రక్షణ పొందాలో వివరించి చెప్పారు. బాలికలందరూ మంచి పోషకాహారాన్ని తీసుకోవాలని, బాల్యవివాహాలు అరికట్టాలని, యుక్త వయసు వచ్చిన తరువాతే పెళ్లి చేసుకోవడం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. ఆరోగ్య సిబ్బంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కళ్యాణి మాట్లాడుతూ, బాలురతో సమానంగా బాలికలకు కూడా అన్ని హక్కులు ఉన్నాయని, "బేటీ బచావో - బేటీ పడావో" అని పెద్దలు చెప్పినట్లు బాలికలందరూ బాగా చదువుకోవాలని, మంచిగా ఎదగాలని సూచించారు. రక్తహీనత నివారణ, పాఠశాల బాలికలు మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల, "గుడ్ టచ్ - బ్యాడ్ టచ్", పోషకాహారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గొగినేనిపాలెం అంగన్వాడి వర్కర్ మాలెంపాటి సునీత, చిన కళ్ళేపల్లి అంగన్వాడి వర్కర్ సిహెచ్ సునీత మాట్లాడుతూ బాలికలకు కౌమార దశలో వచ్చే శారీరక మార్పుల గురించి, హార్మోన్ల ప్రభావం వలన వచ్చే మార్పుల నుండి ఏవిధంగా శరీరాన్ని రక్షించుకోవాలో, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని ఏ విధంగా మెరుగు పరుచుకోవాలో తెలియజేశారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది సంయుక్తంగా గ్రామంలో విద్యార్థులచే సమాజంలో బాలికల యొక్క అభివృద్ధిని కాంక్షించే నినాదాలతో స్లోగన్లతో "బాలికా దినోత్సవ" ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## దాతలు దాతృత్వాన్ని సద్వినియోగం చేసుకోండి



ఘంటసాల, మేజర్ న్యూస్: మండల పరిధిలోని గొగినేనిపాలెం శ్రీ ఎన్.జి.రంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న క్రీడాకారులకు గొగినేనిపాలెం గ్రామ వాస్తవ్యులు అత్తలూరి గోపీచంద్ కుమారుడు అత్తలూరి సుధీర్ కుమార్ రూ 20వేల ఖరీదు చేసే క్రీడా దుస్తులను పాఠశాలలో చదువుతున్న క్రీడాకారులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ప్రసంగిస్తూ దాతలు దాతృత్వాన్ని ప్రతి ఒక్కరు సభ్యులకు పరుచుకోవాలని అలాగే, కృష్ణాజిల్లా 84వ గ్రిగ్స్ మెమోరియల్ బాలుర సెంట్రల్ జోన్ ఆటల పోటీలు ఫిబ్రవరి 4,5,6 తేదీలలో గొగినేనిపాలెం శ్రీ ఎన్.జి.రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సందర్భంగా దాతలు పాఠశాలలోని క్రీడాకారులకు క్రీడా దుస్తులు బహుకరించినట్లుగా తెలియజేశారు. క్రీడా దుస్తులు బహుకరించిన దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు పాఠశాల విద్యా కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గన్నవరంలో ఉత్సాహంగా ప్రారంభమైన సబ్ జోన్ క్రీడలు



గన్నవరం, జనవరి 24, మేజర్ న్యూస్ : గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో శుక్రవారం బాలుర సబ్ జోన్ క్రీడలు ఉత్సాహంగా ప్రారంభమైనాయి. ఈ ఆటల పోటీలను సీనియర్ ఖో ఖో కోర్ట్ ను బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు గొట్టం వెంకట రవి బాబు ప్రారంభించగా, వాలీబాల్ కోర్ట్ ను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే.వి.ఆర్ కిషోర్ ప్రారంభించారు. ఎనిమిది క్రీడాంశాలకు సంబంధించి గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుండి సుమారు గా 350 మంది బాలురు ఈ పోటీలలో పాల్గొన్నారు. శనివారం నాడు జూనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతాయని కృష్ణా జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి సి. హెచ్. చంద్రశేఖరరావు తెలిపారు. ఈ ఆటల పోటీలలో సంఘం అధ్యక్షులు పి. వెంకటేశ్వరావు, ఉపాధ్యక్షులు బి యస్. రామ చంద్రుడు, సబ్ జోన్ కార్యదర్శి యస్. వెంకటేశ్వరావు, సలహాదారుడు యస్. సుబ్బారావు, గన్నవరం వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు కృష్ణ ప్రియ, హరి నారాయణ, రామారావు, బాల కృష్ణ సుబ్బారావు, టాన్య గిరి, గీత, శాంతి, శ్రీదేవి, లక్ష్మణరావు, సుజాత, విజయ కుమారి, తదితరులు హాజరైనారు.

## చీడపీడల యాజమాన్యంపై 5 వ రోజు శిక్షణ



ఘంటసాల, మేజర్ న్యూస్: ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల ప్రాంగణములో జీవ నియంత్రణ పద్ధతులతో చీడపీడల యాజమాన్యం పై ఆరు రోజుల నైపుణ్యత శిక్షణా కార్యక్రమం అయిదవ రోజులో భాగంగా కీటకనాశక శిలీంధ్రం రకాలు, వివిధ పురుగుల యాజమాన్యం లో వాటి ప్రాముఖ్యతని కెవికే సస్యరక్షణ శాస్త్రవేత్త డా. రేవతి గ్రామీణ యువతకు వివరించారు. మార్కెట్ లో ప్రస్తుతం బవేరియా, మెటారైజియం వంటి కీటకనాశక శిలీంద్రాలు అందుబాటులో ఉన్నాయని లీటరు నీటికి 5 గ్రా చొప్పున కలుపుకుని పిచికారి చేయడం ద్వారా చీడ పురుగులను అదుపులో ఉంచవచ్చునని తెలిపారు. వివిధ రకాల కీటకనాశక శిలీంద్రాలు ఉత్పత్తి విధానాన్ని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా. లహరి వివరించారు.

# 12 కోట్ల 39 లక్షల విలువైన నకిలీ సిగరెట్లు, గంజాయి, గార్లిక్ దగ్ధం

### కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

**విజయవాడ మేజర్ న్యూస్ :** అక్రమ రవాణాలో వేర్వేరు కేసుల్లో పట్టుబడి, పన్ను చెల్లించని విదేశీ, స్వదేశీ నకిలీ సిగరెట్లు, గంజాయి, చైనీస్ గార్లిక్ లను కస్టమ్స్, సెంట్రల్ జి.ఎస్.టి అధికారులు అన్నీ అనుమతులతో ధ్వంసం చేసారు. శుక్రవారం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం లో గల జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ లోని ఇన్సినరేటర్ లో వీటిని కాల్చి బూడిద చేసారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఔషధ నిర్మూలన పక్షోత్సవంలో భాగంగా వీటిని దగ్ధం చేయడం జరిగింది. కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అందించిన వివరాల ప్రకారం..దగ్ధం చేసిన వాటిలో ప్యారిస్ బ్రాండ్ పేరుతో విదేశీ గుర్తులు గల సిగరెట్లు 65 లక్షల స్టిక్ లు వున్నాయని, వాటి విలువ 6 కోట్ల 50 లక్షలు వుంటుందన్నారు. అలాగే పన్ను చెల్లించని స్వదేశీ సిగరెట్లు 57 లక్షల స్టిక్ లు వున్నాయని, వీటి విలువ 2 కోట్ల 73 లక్షలు వుంటుందన్నారు. నిషేధిత 2420 కేజీల గంజాయి కూడా పూర్తిగా కాల్చి వేయడం జరిగిందని, దీని విలువ 2 కోట్ల 96 లక్షలు వుంటుందన్నారు. వీటితో పాటు 20 లక్షల విలువ గల ఫంగస్ తో కూడిన 10 టన్నుల చైనీస్ గార్లిక్‌ను కూడా నాశనం చేశామన్నారు. దగ్ధం చేసిన సిగరెట్లు, గంజాయి, గార్లిక్‌లు పూర్తిగా నాశిరకంతో కూడుకున్న నకిలీ ఉత్పత్తులని, ఇవి ప్రజారోగ్యానికి ఎంతో హానికరమని కమిషనర్ నరసింహారెడ్డి ఈ సందర్భంగా వెల డించారు. వీటిని నిల్వ చేయడం, అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శిక్షలు, జరిమానాలు ఉంటాయన్నారు. పొగాకు



ఉత్పత్తుల చట్టం కింద నమోదైన చట్టబద్ధమైన చిత్రాలు, హెచ్చరికలు, గడువు తేదీ, తయారీదారు వివరాలు, బ్యాచ్ నెంబర్లను ప్రజలు గమనించాలన్నారు. నకిలీ సిగరెట్ ఉత్పత్తులను వ్యాపారులు, ప్రజలు ప్రోత్సహించవద్దని కమిషనర్ కోరారు. స్మగ్లింగ్ వ్యతిరేక కార్యకలాపాలు, ప్రజారోగ్యాన్ని కాపాడటంలో, అక్రమ వ్యాపారాన్ని అరికట్టడంలో తమ అధికారులు అప్రమత్తత, అంకితభావంతో పనిచేస్తున్నారని కమిషనర్ తెలిపారు.

# శ్రీ సత్యసాయి జిల్లాలో అక్రమ మైనింగ్‌పై జై భీమ్ రావ్ భారత్ పార్టీ పోరాటం

**విజయవాడ మేజర్ న్యూస్ :** శ్రీసత్యసాయి జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై ఎన్జీటీలో సత్యసాయి జిల్లాకు చెందిన జై భీమ్ రావ్ భారత్ పార్టీ అధ్యక్షులు నాగరాజు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో అప్లికేషన్ దాఖలు చేశారు. సత్యసాయి జిల్లాకు చెందిన టీడీపీ జిల్లా అధ్యక్షులు వడ్డే ఆంజనప్ప,వడ్డే నవీన్ కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరుపు నాగరాజు హైకోర్టు ప్రముఖ న్యాయవాది, జై భీమ్ భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జడ శ్రావణ్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో వర్చ్యువల్ గా వాదనలు వినిపించారు. జయమంగలి, పెన్నా నదీ పరివాహక ప్రాంతంలో కోట్ల రూపాయల విలువచేసే ఇసుకను అక్రమార్కులు అక్రమ రవాణా చేస్తున్నారని దీనికి అధికారులు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నారని జడ శ్రావణ్ వాదనలు వినిపించారు. నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న డిపార్ట్మెంట్ ఆఫ్ మైన్స్ & జియాలజీ, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని జడ శ్రావణ్ ఎన్జీటీ దృష్టికి తీసుకు వచ్చారు.. టీడీపీ &జనసేనా నేతలు ఇసుక అక్రమ రవాణాలో చెలరేగి పోతున్నారని...అక్రమార్కులు ఇంతలా అక్రమ రవాణాకు పాల్పడుతున్నా కూటమి ప్రభుత్వం మిన్నకుండి పోయిందని అన్నారు. నదీ పరివాహక ప్రాంతంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడం, నదీ పరివాహక ప్రాంతాలను రక్షించడం తమ జై భీమ్ రావ్ భారత్ పార్టీ బాధ్యతని గ్రీన్ ట్రిబ్యునల్ కు జడ శ్రావణ్ తెలియజేశారు. ఇసుక అక్రమ రవాణా నిలువరించడానికి ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని గ్రీన్ ట్రిబ్యునల్ వివరణ కోరింది. ప్రతివాదులు వడ్డే నవీన్,ఆంజనప్పకు నోటీసులు జారీ చేయాలని గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించింది.. ప్రిన్సిపల్ సెక్రటరీ మైన్స్,జియాలజీ, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ను కౌంటర్ దాఖలు చేయాలని గ్రీన్ ట్రిబ్యునల్ కోరింది. తదుపరి విచారణ వచ్చేనెల 3 వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రముఖ న్యాయవాది జై భీమ్ రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపకులు జడ శ్రావణ్ తెలిపారు.





# బాలికలు స్వశక్తితో ఎదగాలి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** యుక్త వయసులో ఉన్న బాలికలు అపద సమయంలో ఎవరి సహాయం కోసమో ఎదురుచూడకుండా స్వశక్తితో ఎదుర్కోవాలని అని,ఆ దిశగా అడుగులు వేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎన్ ఉష మాట్లాడుతూ కాలానుగుణంగా బాలికల ఆలోచనా సరళి మార్చుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావానికి లోనుకాకుండా జీవితాన్ని తీర్చి. ఫార్మసీ కళాశాల విభాగాధిపతి ఆచార్య మారుతి మాట్లాడుతూ మహిళల్లో పెరుగుతున్న చైతన్యానికి కృష్ణా విశ్వవిద్యాలయం చక్కని ఉదాహరణ అన్నారు. మహిళా ఉద్యోగులు, మహిళా విభాగాధిపతులు, మహిళా విద్యార్థినులు అధిక సంఖ్యలో ఉన్న విషయాన్ని ప్రస్తావించారు.అనంతరం ఎం ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం శ్రావణి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# తాడంకి ఉన్నత పాఠశాలకు ఐడిబిఐ బ్యాంకు వితరణ




**పామర్రు జనవరి 24 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విజయవాడ రీజియన్ పరిధి లోని ఉయ్యూరు ఐడిబిఐ బ్రాంచ్ నూతన కంప్యూటర్, ఫర్నిచర్ తదితర సామాగ్రిని అందజేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా 65,000 రూపాయల విలువ కలిగిన ఫర్నిచర్ అందజేసినట్లు ఐడిబిఐ బ్యాంక్ ఏజిఎం వలిపే చందన్ తెలిపారు. ప్రస్తుత విద్యా విధానంలో విద్యార్థులకు కంప్యూటర్ విజ్ఞానం ఎంతో అవసరమని, వారికి ఆ సాంకేతికతను అందించాలని లక్ష్యంతో పాఠశాలకు కంప్యూటర్లను బహూకరించామని ఈ సందర్భంగా బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని సత్ఫలితాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ జాదు కిరణ్ కుమార్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ బి.వీరాంజనేయులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యలమంచిలి నాగ శివప్రసాద్, తాడంకి గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకులు జక్కా శ్రీనివాస రావు, పాఠశాల ఎస్ఎంసి వైస్ చైర్మన్ కాండ్రు శేఖర్, కోఆప్షన్ సభ్యులు పులి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పాఠశాలకు అత్యంత ఉపయోగకరంగా ఉండే విధంగా కంప్యూటర్ తో పాటు ఐరన్ బీరువా, రెండు ఐరన్ రాక్స్, కుర్చీలు తదితర ఫర్నిచర్ ను అందజేసినందుకు పాఠశాల విద్యా కుటుంబం తరపున ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

### నగరంలో శానిటేషన్ పట్ల

# నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

### కలెక్టర్ డికె బాలాజీ



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** నగరంలో శానిటేషన్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ అధికారులను, శానిటేషన్ సిబ్బందిని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉదయం స్థానిక 45, 46 డివిజన్లలో పర్యటించి ఇంటింటి చెత్త సేకరణ ఎలా జరుగుతున్నది? పరిశీలించారు. చెత్త సేకరించే సమయంలో తడి /పొడి చెత్త వేరు చేయించి సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ రోడ్ల వెంబడి చెత్త ఎవరు వేస్తున్నారు, ఎందుకు వేస్తున్నారని, శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఈడేపల్లి చిన్న శక్తి గుడి రోడ్డులో రోడ్డు వెంబడి చెత్త, అపరిశుభ్రత పరిశీలించిన కలెక్టర్ శానిటేషన్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రజలు తడి పొడి చెత్త వేరు చేసి శానిటేషన్ సిబ్బందికి అందించేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువగా చెత్త వేస్తున్న గార్బేజ్ స్పాట్స్ గుర్తించి, ఎవరు వేస్తున్నారో తెలియడం లేదని, అట్టివారిని గుర్తించేందుకు అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ నూరు శాతం జరగాలని కమిషనర్ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని, ఇందులో భాగంగా స్వచ్ఛ మచిలీపట్నం, సుందర మచిలీపట్నం సాధనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపీచంద్, వార్డు ఇన్చార్జి పివి ఫణి కుమార్ మున్సిపల్ సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు..

# శాంతి సౌఖ్యాలకై వార్షిక కల్యాణోత్సవం

### వేముల హజరత్తయ్య గుప్తా



**విజయవాడ మేజర్ న్యూస్ :** సర్వజనుల శాంతి సౌఖ్యాలు కాంక్షించి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా శ్రీవేంకటేశ్వర స్వామి వార్ల కళ్యాణోత్సవం పూర్ణానంద పేట శ్రీ కోదండరామ దాశాంజనేయ స్వామివార్ల ఆలయ ప్రాంగణంలో దాదాపు 37 సంవత్సరాల క్రితం పులిపాటి దుర్గా రావు, కోటేశ్వరమ్మ దంపతుల చే శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రతిష్టించగా, వారి వారసులు దుర్గాప్రసాద్ విజయకుమారి, సాయిరామ్ ఉషారాణి దంపతులు స్వామి వార్ల అభిషేకం, కల్యాణోత్సవం జరిపిస్తున్నారని, ఆలయం లో ప్రతి పూజా కార్యక్రమాలు విశేషంగా, వేడుకగా జరుపుకుంటామని, భక్తులు విరివిగా పాల్గొని వారి కోర్కెలు నివేదించుకొని సత్ఫలితాలు పొందుతుండటం ఆనందదాయకమైన విషయం అని, సమాజ శ్రేయస్సు కి నిర్మూలమైన ఆధ్యాత్మికతే మూలబిందువని ప్రముఖ సామాజిక ఆధ్యాత్మికవేత్త ఆలయ ట్రస్టీ కన్వీనర్ వేముల హజరత్తయ్య గుప్తా సందేశమిస్తూ ప్రతి ఒక్కరూ భక్తి భావాలు కలిగి వుండాలని శ్లోక భావ యుక్తం గా తెలిపారు. గోపీ కృష్ణమాచార్యులు, నారాయణ స్వామి, షణ్ముఖ, బాబు పంతులు మంత్రోచ్ఛారణ చేయగా, పీవీడి ప్రసాద్ అన్నప్రసాద వితరణ పర్యవేక్షించారు. చిరంజీవి రేనిష్కా నృత్యం అలరించింది.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు **ఎస్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999